లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

సుదర్శన నారసింహహోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. శ్రావణమాసం కావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దాంతో తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. క్యూలైన్లు, ప్రసాదవిక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 2 గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

స్వామివారికి నిత్య పూజలు

తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవసేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణపుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ. 48,47,250 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

జస్టిస్ చంద్రగోశ్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, ఆగస్టు 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని ఆదివారం సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రగోశ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. యాదగిరికొండకు చేరుకున్న ఆయన స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయ స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేశారు. ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు.

ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థులతో జీఎంఎస్ ట్రస్ట్ ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

రాజాపేట, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని సరస్వతీ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు జీఎంఎస్ ట్రస్ట్ ప్రతినిధి రిటైర్డ్ ఉపాధ్యాయుడు గౌస్ సహకారంతో 8 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. బీటెక్ చదువుతున్న ఉద్విక్‌కు రూ. 15 వేలు, డిగ్రీ చదువుతున్న సింధుకు రూ.10 వేలతో పాటు మరో ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అందించారు. అనంతరం దాత గౌస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్, కళాశాల ప్రిన్సిపాల్ సోమసాని సురేందర్, పూర్వ విద్యార్థులు రేగు సిద్దులు, సంగెం మధు, గుర్రం పాండు, స్వరన్‌పాల్‌సింగ్, నాగరాజు, సతీశ్, శైలజ, నరేశ్ పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామన్నపేట, ఆగస్టు 25 : మండలంలోని వెల్లంకి ఉన్నత పాఠశాలకు చెందిన 2006-07 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బి. వెంకటేశం, ఎస్. కృష్ణయ్య, ఎ.వెంకటేశం, రమేశ్, వెంకటరమణ, శశిధర్‌రెడ్డి, స్వామి, కృష్ణారెడ్డి, ఆరీఫ్, ఫసియొద్దీన్ పాల్గొన్నారు.

గీత కార్మికుడు మృతి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 25 : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసుల రాములు (60) శనివారం సాయంత్రం తాటి చెక్కు ఎక్కుతూ ఆకస్మికంగా చెట్టుపైనే మృతి చెందాడు. కల్లుగీసేందుకు సాయంత్రం వెళ్లిన రాములు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడికోసం వెతకగా గ్రామ శివారులో తాటిచెట్టుపై మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కృష్ణయ్య ఆదివారం రాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

సోమేశ్వరయూత్ కార్యవర్గం ఎన్నిక

ఆలేరురూరల్,ఆగస్టు 25 :మండలంలోని బొల్లబోనితోట సోమేశ్వరయూత్ కార్యవర్గాన్ని ఆదివారం కొలనుపాక గ్రామంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాటూరి నర్సింహులు, గౌరవాధ్యక్షుడిగా నేరెళ్ల రాజు, ఉపాధ్యక్షులుగా డ్యాగల ప్రభాకర్, బండపల్లి వెంకటేశ్, పారుపల్లి వెంకటేశ్, ప్రధానకార్యదర్శులుగా నేరెళ్ల రాజేశ్, కలకుంట్ల కర్ణాకర్, కార్యదర్శులుగా వాకిటి కార్తిక్, డ్యాగల చంద్, కోశాధికారిగా గుర్రాల రమేశ్, సహాయ కార్యదర్శిగా దాసరి శ్రీకాంత్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పల్లె పల్లెనా బోనాల సందడి

- జిల్లా వ్యాప్తంగా బోనాల పండుగ
- గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ప్రజలు

భూదాన్ పోచంపల్లిలో పోతరాజుల విన్యాసం

యాదగిరిగుట్ట, ఆగస్టు 25 : మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆదివారం బీరప్ప బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలతో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య ఆలయానికి తరలివెళ్లారు. బీరప్ప స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కురుమ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- రాజాపేట : మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ప్రదర్శనగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని మద్దెలమ్మ దేవికి ఆదివారం పద్మశాలీలు బోనాలు సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో తరలివెళ్లి అమ్మవారిని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు విన్యాసాలు, శివ సత్తుల పూనకాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాహనంపై ఏర్పాటు చేసిన చేనేత మగ్గంపై చేనేత వస్త్రాన్ని తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ మహాజన సంఘ అధ్యక్షుడు సీత శ్రీరాములు, మద్దెలమ్మ దేవి ఆలయ చైర్మన్ సురపల్లి రాము, టై అండ్ డై అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు తడక వెంకటేశం, తడక రమేష్, సురపల్లి రమేశ్, భోగ స్వామి, గంజి యుగేంధర్, గుండు శ్రీరాములు, ఉప్పలయ్య, కుడికాల బాలనరసింహ, గంజి అంజయ్య, ఆడెపు అరవింద్, రుద్ర చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.
- వలిగొండ : మండలంలోని వలిగొండ, నాగారం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేంగింపుగా తరలివెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని డోలు వాయించి భక్తులను ఉత్సహపర్చారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.
- మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, జామచెట్లబావి, కొండాపురం కాలనీల్లో బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలతో ముత్యాలమ్మ ఆలయం చుట్టూ ప్రదర్శన నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- మోటకొండూర్ : మండల కేంద్రంలో కురుమసంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివెళ్లి పోచమ్మ, బీరప్ప, కంఠమహేశ్వరుడి ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

యాదగిరిగుట్ట: వంగపల్లిలో బోనాలతో బీరప్ప ఆలయానికి వెళ్తున్న మహిళలు

రాజాపేట : గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకునేందుకు బోనాలతో వెళ్తున్న మహిళలు

వలిగొండలో బోనాల ఉత్సవాల్లో పాల్గొని డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్ : పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న పట్టణంలోని 23వ వార్డు ప్రజలు

వలిగొండ : నాగారం గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మోత్కూరులో ముత్యాలమ్మకు బోనాల సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

ఆలయ నిర్మాణానికి విరాళం

బీబీనగర్, ఆగస్టు 25 : బీబీనగర్ పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి ఆదివారం రూ.50వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో పేరబోయిన రాములు యాదవ్, శేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బీబీనగర్, ఆగస్టు 25 : బీబీనగర్ – ఘట్‌కేసర్ మండలాల మధ్య 225/6-8 మైలురాయి వద్ద ఆదివారం గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, షర్ట్ కాలర్‌పై శివ సాయి టైలర్, నర్సాపూర్, మెదక్ జిల్లా అని స్టిక్కర్ ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవఖానలో భద్రపర్చినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 9848222169, 8712568454 నంబర్‌కు తెలుపాలని ఆయన కోరారు.

'ట్రిపుల్ ఆర్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి'

చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 25 : ట్రిపుల్ ఆర్ బాధితులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు ఉప్పుకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని హెచ్ఎండీఏ పరిధిలో ట్రిపుల్ఆర్ నిర్మాణంతో భవిష్యత్‌లో పట్టణాభివృద్ధికి విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు 40కిలోమీటర్ల దూరం నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మిస్తామని చెప్పిన అధికారులు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 28 కిలోమీటర్ల లోపలే నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ట్రిపుల్ఆర్ అలైట్‌మెంట్‌ను మార్చాలని కోరారు.

వసతులు మెరుగు పర్చాలని వినతి

యాదగిరిగుట్ట, ఆగస్టు 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు వసతులు మెరుపర్చాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆదివారం కొండపైన ఈఓ భాస్కర్ రావుకు వినతిపత్రం అందించారు. కొండపైకి భక్తుల బైక్‌లను అనుమతించాలని, గోశాలకు బడ్జెట్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు కాదూరి అచ్చయ్య, గుంటుపల్లి సత్యం, సంతోశ్, శివ ఉన్నారు.

మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ

సమావేశంలో మాట్లాడుతున్న చింతల శివ

మోత్కూరు, ఆగస్టు 25 : మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరి సైకిల్ యాత్ర ఆదివారం మోత్కూరుకు చేరకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలను యాత్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అద్దె భవనం కావడంతో ప్రహరీ కూడా సరిగా లేదని విద్యార్థులకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వం సొంత భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు బుర్రు అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, నరేందర్, సాయి, వినయ్, రాకేశ్, మహేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన అధికారులు

ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉద్యోగులకు సన్మానం

అడ్డగూడూరు, ఆగస్టు 25 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆరుగురు అంగన్‌వాడీ టీచర్లు, ఇద్దరు ఆయాలను ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మధురమ్మ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక

రాణి రుద్రమదేవి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

చౌటుప్పల్, ఆగస్టు 25 : చౌటుప్పల్‌లోని విద్యానగర్ కాలనీలో ఆదివారం రాణి రుద్రమదేవి వినాయక ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోలోజు శ్రీలత, కమిటీ సభ్యులుగా చోల్లేటి పద్మ, గుత్తికొండ ఉషారాణి, ఎర్రగొల్ల అరుణ, వినుకొండ సరిత, బైరు ఝాన్సి, సంగెం ప్రశాంతి, బొజ్జ రజని, దంతూరి రాజశ్రీ, ఎలువర్తి నవ్యశ్రీ, పుట్ట రమణ, బొమ్మ రమ్య, దాసోజు సంధ్య, కలుముల ఈశ్వరీ ఎన్నికయ్యారు. ప్రతి సంవత్సరం మహిళలే వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఈ కాలనీ ప్రత్యేకత.



సారగండ్లగూడెం వద్ద తుమ్మచెట్ల కొమ్మలపై గూళ్లు ఏర్పాటు చేసుకున్న కొంగలు

కొమ్మ కొమ్మకో కొంగగూడు

ఆత్మకూరు(ఎం),ఆగస్టు 25 : మండలంలోని పారుపల్లి నుంచి సారగండ్లగూడెం వెళ్లే దారి వెంట ఉన్న తుమ్మచెట్ల కొమ్మలపై తెల్లని, నల్లని కొంగలు గూడ్లు ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతి రోజూ గుంపులుగా చెట్ల కొమ్మలపై దర్శనమిస్తున్న కొంగలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ, ఆగస్టు 25: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం సాయంత్రం వలిగొండ మండలంలోని లోతుకుంట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆత్మకూర్ఎం మండలంలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన అంబోజు నర్సింహ(54) కూతురు పెండ్లి కోసం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు ఇబ్బందులు పడుతూ జీవితం మీద విరక్తి చెంది తోతుకుంట గ్రామ సమీపంలో పురుగులు మందు తాగి అపస్మారక స్థితిలో పడి కనిపించాడు. అతడిని గుర్తించిన లింగరాజుపల్లి గ్రామస్తులు చికిత్స కోసం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి హైదారాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

బసంతాపురంలో మరొకరు..

రాజాపేట : మండలంలోని బసంతాపురం గ్రామానికి చెందిన మెండు బుచ్చిరెడ్డి(50) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుచ్చిరెడ్డి కొంతకాలంగా కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవలే గ్రామానికి వచ్చి తన కున్న భూమిలో వరిసాగు చేశాడు. ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి : సీపీఐ

ఆలేరురూరల్, ఆగస్టు 25 : అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొలనుపాకలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం కొలనుపాకలో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఆరుట్ల రాంచంద్రారెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పోతు ప్రవీణ్, చిరంజి, మహేందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలుకు 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా

శాలిగౌరారం, ఆగస్టు 25: రైతులందరికీ రూ. 2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులివ్వండి

ప్రభుత్వ విప్‌కు ఇందిరా నగర్ వాసుల వినతి



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఇందిరానగర్‌కాలనీ ప్రజలు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 25 : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలం లో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం రూ. 25 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ కాలనీ వాసులు ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో కాలనీ వాసులు కూరెళ్ల అనిల్, గట్టు రాజు, శేఖర్, మహేశ్, శ్రీకాంత్, కృష్ణ ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్, బీసీ సంఘం నాయకులు

రాజాపేట, ఆగస్టు 25 : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీహార్ మాజీ సీఎం బిందేశ్వరీప్రసాద్ మండల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీలకు అభ్యున్నతి కోసం మండల్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిమ్మి సత్యనారాయణ, బత్తిని యాదయ్యగౌడ్, శ్రీకాంత్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

నెమలిని అటవీ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 25: ఎక్కడి నుంచి వచ్చిందో ఏమోగానీ పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన న్యాయవాది వెంకటేశం ఇంట్లోని చెట్ల పొదల్లో ఆదివారం నెమలి కనిపించింది. దాంతో ఆయన 100కు డయల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని నెమలిని పట్టుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ డీఆర్ఓ శ్రీనివాస్, సిబ్బంది న్యాయవాది ఇంటికి వచ్చి నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

భువనగిరికి చేరిన భారీ గణనాథుడు

ఊరేగింపుగా వినాయక విగ్రహాన్ని భువనగిరికి తీసుకొస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 25: వచ్చేనెల 7న వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని హనుమాన్‌వాడలో ఏర్పాటు చేసేందుకు హనుమాన్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం హైదరాబాద్ నుంచి భారీ గణనాథుడిని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో డప్పు చప్పుళ్లు, కోలాట, భజన మండలి సభ్యుల విన్యాసాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నరాల శ్రీనివాస్ యాదవ్, గీస ఆనంద్, ఎలిమినేటి మహేందర్‌రెడ్డి, నాని, అనిల్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.